

పరీక్ష సమయం..
పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రణాళిక ప్రకారం విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. 8లో▸



పోటీలతో పెరగనున్న నైపుణ్యం
ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఒలింపియాడ్ పోటీలు భాష నైపుణ్యాన్ని పెంచుతాయని డీఈవో యాదయ్య తెలిపారు. ఆంగ్లభాష పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /17.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

సర్టిఫికెట్ల పరిశీలన

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని జిల్లా విద్యాధికారి కార్యాలయంలో మంగళవారం స్పౌజ్ బదిలీలు పొందిన ఉపాధ్యాయుల ఒరిజినల్ సర్వీస్ బుక్, స్పౌజ్ ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. మంచిర్యాల నుంచి ఆదిలా బాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు స్పౌజ్ బదిలీపై వెళ్లనున్న ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించారు. కుమురంభీం ఆసిఫాబాద్ నుంచి 28 మంది, ఇద్దరు నిర్మల్ నుంచి స్పౌజ్ ఉపాధ్యాయులు మంచిర్యాల జిల్లాకు రానున్నారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: భారతదేశం 75 సంవత్సరాల గణతంత్ర దినోత్సవాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా బీజేపీ పిలుపు మేరకు ప్రతీ బూత్‌లో రాజ్యాంగ గౌరవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం బీజేపీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ.. ఈ నెల 22, 23 తేదీల్లో ఎస్సీ, ఎస్టీ ప్రజలతో సమావేశం నిర్వహించి, 24, 25 తేదీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో రాజ్యాంగంపై బీజేపీ నిబద్ధతను యువతలో ప్రచారం చేయాలని సూచించారు. 26వ తేదీన గణతంత్ర దినోత్సవాన్ని ప్రతీ బూత్‌లో ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రజనీశ్ జైన్, పట్టి వెంకటకృష్ణ, దుర్గం అశోక్, ఆరుముళ్ల పోషం, నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, తుల ఆంజనేయులు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు భరోసా కల్పించాలి



సమీక్ష నిర్వహిస్తున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: బాధిత మహిళలకు భరోసా కల్పించాలని డీసీపీ ఎగ్గడి భాస్కర్ సూచించారు. స్థానిక డీసీపీ కార్యాలయంలో మంగళవారం షీ టీమ్, మహిళా పోలీస్‌స్టేషన్, భరోసా సెంటర్ సిబ్బందితో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో షీ టీమ్స్, ప్రధానంగా ఇదివరకే గుర్తించిన హాట్‌స్పాట్స్‌ను ప్రతీ రోజు సందర్శించాలని సూచించారు. ఈవ్ టీజర్స్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేలా ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలని తెలిపారు. స్కూళ్లు, కళాశాలలు, జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. జిల్లాలోని మహిళా కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లను సందర్శించి భద్రత ఏర్పాట్లపై హాస్టళ్ల యాజమాన్యంతో సమీక్షించాలని సూచించారు. సీసీ కెమెరాలు, నైట్ సెక్యూరిటీ గార్డ్, మహిళా ఇన్‌చార్జి తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భరోసా కేంద్రాల్లో బాధిత మహిళ లేదా బాలికకు వైద్యం, కౌన్సిలింగ్ అన్ని రకాల సేవలు అందించనున్నట్లు తెలిపారు. మహిళా పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల్లో ఫ్యామిలీ కౌన్సిలింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు, సమస్యలుంటే విడిపోవడం, కోర్టు కేసులతో భవిష్యత్‌లో ఎదుర్కొనే పరిణామాలపై వారికి అర్థమయ్యేలా పలుసార్లు వివరించాలని సూచించారు. మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నరేశ్‌కుమార్, షీ టీమ్ జిల్లా ఇన్‌చార్జి ఎస్సై హైమ, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

రవితేజకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రవితేజ

జైపూర్: మండలంలోని బెజ్జాల గ్రామానికి చెందిన మంతెన రవితేజ తెలుగు సాహిత్యంపై చేస్తున్న కృషికి గుర్తింపుగా నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, అంతర్జాతీయ సాహిత్య సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీకళావేదిక ద్వారా జాతీయ తెలుగు యువపురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ కతమండ ప్రతాప్ రవితేజకు పురస్కారం ప్రదానం చేశారు. జిల్లాకు చెందిన పలువురు కవులు రవితేజను అభినందించారు.

చేరుదాం.. సురక్షితంగా..



చెన్నూర్: తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న సీఐ రవీందర్

- భద్రతే అందరి లక్ష్యం కావాలని..
- జిల్లాలో ఈ నెల 31వరకు రోడ్డు భద్రత మాసోత్సవాల నిర్వహణ
- జీరో ప్రమాదాల జిల్లా కోసం రవాణాశాఖ ప్రత్యేక కార్యక్రమాలు

జిల్లాలో రోడ్డు ప్రమాద వివరాలు	గతేడాది ప్రమాదాలు:	క్షతగాత్రుల సంఖ్య:	మరణించిన వారు:
	412	434	132

వాహనాల వివరాలు

ద్విచక్ర వాహనాలు:	2,27,432
ఆటో రిక్షాలు:	14,417
కార్లు, జీపులు, ట్యాక్సీలు:	26,327
ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలు:	19,687
విద్యాసంస్థల వాహనాలు:	507
మొత్తం వాహనాలు:	2,95,700

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 'అమ్మ ప్రాణమిస్తుంది.. భద్రత పునర్జన్మనిస్తుంది..' అనేది అందరికీ తెలిసిన నానుడి. అవును.. రోడ్డు భద్రత పాటిస్తేనే ఈ నానుడికి అంతా సహకరించిన వారమవుతాం. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జిల్లాలో గతేడాది జరిగిన 412 రోడ్డు ప్రమాదాల్లో 132 మంది మరణించారు. 434 మంది క్షతగాత్రులయ్యారు. సరైన రోడ్డు భద్రత నిబంధనలు పాటించక పోవడంతో పలు వాహనదారులు, యువత తమ జీవితాలు కోల్పోయారు. వాహనాలు నడపడంలో సరైన అవగాహన లేకపోవడం, మితిమీరిన వేగంతో నడపడటమే ప్రమాదాలకు ప్రధాన కారణాలవుతున్నాయి. ప్రతీరోజు కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తుండటంతో రోడ్డు భద్రతపై అవగాహన లేక ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రమాదాలను నివారించాలనే లక్ష్యంతో కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ ప్రతీ ఏడాది రహదారి భద్రత వారోత్సవాలు, మాసోత్సవాల పేరిట వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందుకు అన్ని శాఖల సాయం తీసుకుంటోంది. జాతీయ రహదారి అథారిటీ ఆఫ్ ఇండియా, పంచాయతీరాజ్, పోలీస్, వైద్యారోగ్య, రహదారులు–భవనాలు, ప్రజారవాణా, విద్య, వైద్యశాఖలతోపాటు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో రోడ్డు భద్రత మాసోత్సవాలు జిల్లాలో ప్రారంభమయ్యాయి. ఈ నెల 31వరకు కొనసాగుతాయి. పాటించాల్సిన ప్రణాళికలు, జాగ్రత్తలను విశ్లేషిస్తూ కార్యక్రమాలు రూపొందించగా మంచిర్యాలను జీరో ప్రమాద రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు.

అవగాహన కల్పిస్తూ..

జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,95,700 వివిధ రకాల వాహనాలున్నాయి. ఇవి జిల్లాలోని వివిధ జాతీయ, రాష్ట్రీయ, జిల్లా రహదారులపై నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. అనేక రాష్ట్రాల నుంచి సరుకులు రవాణా చేసే వాహనాలూ ఈ ప్రాంతంలో తిరుగుతున్నాయి. దీంతో పాటు ద్విచక్ర వాహనాలు, ఆటోలు ట్రాఫిక్ నిబంధనలు సరిగా పాటించక పోవడంతో పలు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రమాదాల్లో మరణాలు సంభవించడంతో పాటు క్షతగాత్రులైన వారితో వారి కుటుంబాలు తీరని వ్యధను అనుభవిస్తున్నాయి. కొన్ని ప్రమాదాల్లో పెద్ద ఎత్తున ప్రాణనష్టం సంభవిస్తుండగా.. ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంటోంది. గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాలు, గాయపడిన వారి సంఖ్య, మరణించిన వారి వివరాలతో పాటు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపగా వారిపై నమోదైన కేసులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని వాటి నివారణకు ఈ భద్రత మాసోత్సవాల సందర్భంగా అవగాహన కల్పిస్తున్నారు. ఆటోలు, లారీలు, టిప్పర్లు, బస్సులు తదితర వాహనదారులు, డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తున్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించక పోవడం, మితిమీరిన వేగంగా పోవడం, రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేయడం తదితర ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ఈ కారణంగా జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు. మాసోత్సవాల్లో భాగంగా పోలీసులు, రవాణాశాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రత కార్యక్రమాలు చేపడుతున్నా వాహనదారులు ఇంకా అప్రమత్తం కావడంలేదనే ఆరోపణలున్నాయి. మాసోత్సవాల సందర్భంగా మాత్రమే అవగాహన కల్పించడం కంటే ఏడాది పొడవునా భద్రత కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

నిబంధనలు కఠినం చేస్తున్నాం



వాహనచోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు మరింత కఠినం చేస్తున్నాం. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం లాంటి నిబంధనలు తప్పనిసరిగా అమలు జరిగేలా చూస్తాం. లేనిపక్షంలో భారీ మొత్తంలో జరిమానా విధించడంతో పాటు వాహనాలు సీజ్ చేస్తాం. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే వాహన చోదకులు ఇబ్బందులు పడక తప్పదు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలి. మాసోత్సవాల్లో అందరూ భాగస్వాములు కావాలి. రోడ్డు భద్రత నియమాలు పాటించి రక్షణతో పాటు కుటుంబానికి భరోసా కల్పించాలి.

– సంతోష్, జిల్లా రవాణాశాఖాధికారి

గ్రామసభల్లో నిలదీతలు



చిర్రకుంటలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



పోలంపల్లిలో ..

- అర్హుల జాబితాపై అభ్యంతరాలు
- లబ్ధి పొందిన వారినే మళ్లీ ఎంపిక చేశారంటూ ప్రశ్నల వర్షం

బెల్లంపల్లి/భీమారం/భీమిని/మందమర్రిరూరల్: ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రేషన్‌కార్డుల అర్హుల ఎంపికకు మంగళవారం జిల్లాలో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. అనర్హులకు జాబితాలో చోటు కల్పించారంటూ అధికారులను నిలదీశారు.

- బెల్లంపల్లి మున్సిపాల్టీ ఒకటో వార్డు కన్నాల బస్తీలో లబ్ధిదారుల పేర్లు చదివి వినిపించగా.. గతంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వ్యక్తులు, అనర్హులు ఉండడంతో బస్తీ ప్రజలు నివ్వెరపోయారు. పేదల పేర్లు లేవంటూ మహిళలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అర్హులమైనా తమ పేర్లు ఎందుకు రాలేదని, ఓ ప్రజాప్రతినిధి సూచించిన వ్యక్తుల పేర్లు మాత్రమే జాబితాలో ఉన్నాయని, గతంలో ఇళ్లు మంజూరైన వారిని మళ్లీ ఎలా ఎంపిక చేశారని మండిపడ్డారు. ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ శ్వేతలను మహిళలు ప్రశ్నించారు. పేర్లు రాని వ్యక్తులు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో సూచించారు. సభ రసాభాసగా మారడంతో అధికారులు అర్ధంతరంగా ముగించి వెళ్లిపోయారు. తదుపరి 11వార్డుల్లో మొక్కుబడిగా సభలు నిర్వహించారు.
- భీమారం మండలం పోలంపల్లి గ్రామసభలో తహసీల్దార్ సదానందంను గ్రామస్తులు నిలదీశారు. అనర్హులకు రేషన్‌కార్డులు ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీనివ్వడంతో ఆందోళన విరమించారు. ఎలకేశ్వరం, బూర్గుపల్లి, ఆరెపల్లి గ్రామసభల్లో ప్రజలు రేషన్‌కార్డులు కావాలని డిమాండ్ చేశారు.
- భీమిని, కన్నెపల్లి మండలాల్లో మంగళవారం పలు గ్రామాల్లో నిర్వహించిన సభల్లో దరఖాస్తులు స్వీకరించారు. కన్నెపల్లి పంచాయతీ కార్యాలయంలో అర్హులైన వారి పేర్లు జాబితాలో లేవని అధికారులను నిలదీశారు. టెంట్, కుర్చీలు, మంచినీటి సౌకర్యం కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకాధికారి ఈ.శంకర్, ఎంపీడీవోలు గంగామోహన్, శంకర్, తహసీల్దార్లు బికార్ణదాస్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.
- మందమర్రి మండలం చిర్రకుంటలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హుల పేర్లు లేవని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఇదివరకు లబ్ధి పొందిన వారే మళ్లీ అర్హులా అంటూ మండిపడ్డారు. ఎంపీడీవో రాజేశ్వర్ స్పందిస్తూ జాబితాపై అభ్యంతరాలు తెలియజేయాలని, పేరు లేని వారు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు. అందుగులపేట్‌లో ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా జాబితాపై గ్రామస్తులు మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో 480 మందిని సర్వే చేసి 252 మందిని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారని, అర్హులందరినీ పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ పథకాలు అమలు

- కలెక్టర్ కుమార్ దీపక్
- జిల్లాలోని గ్రామసభల్లో పాల్గొన్న కలెక్టర్



పెద్దంపేట గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/బెల్లంపల్లి/శ్రీరాంపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ అందేలా చూస్తామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన హాజీపూర్ మండలం గఢ్‌పూర్, చిన్నగోపాల్‌పూర్, నాగారం, ర్యాలీ, పెద్దంపేట, దొనబండ, బెల్లంపల్లి, నస్పూర్ మున్సిపాల్టీల్లోని వార్డుల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తామని, సొంత స్థలం ఉండి ఇల్లు లేని అర్హులకు ఇందిరమ్మ ఇంటి పథకం వర్తింపజేస్తామని తెలిపారు. గ్రామసభల్లో అర్హుల జాబితా చదివి వినిపించిన తర్వాత జాబితాలో లేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ కిషన్, బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జే.శ్వేత, కమిషనర్ కే.శ్రీనివాసరావు, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీశ్, వైస్ చైర్మన్ గెల్లు రజిత తదితరులు పాల్గొన్నారు. నస్పూర్ మున్సిపాల్టీ 8వ వార్డు సభలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ పాల్గొన్నారు.

పల్లెల్లో అక్షర జ్ఞానం

- న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాంకు కార్యాచరణ
- కాసిపేట మండలంలో వందశాతం అమలుకు సన్నద్ధం



వయోజన విద్యలో భాగంగా మహిళలతో అక్షరాలు దిద్దిస్తున్న వలంటీరు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: నిరక్షరాస్యులకు విద్యను మరింత చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా 'న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం (ఎన్ఐఎల్‌పీ)' అమలు చేస్తోంది. గతంలో ఉన్న వయోజన విద్య తరహాలోనే ఈ పథకాన్ని ఇకనుంచి మరింత పకడ్బందీగా అమలు చేయనుంది. ఈ పథకంలో భాగంగా 15ఏళ్లకు పైబడి ఉన్న చదువురాని వారందరికీ ఉచితంగా చదువు నేర్పడంతోపాటు ఉపాధి కల్పించే విధంగా వృత్తివిద్యపైనా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లాలోనూ నూతన కార్యక్రమం అమలుకు రంగం సిద్ధమైంది. అక్షరాలు దిద్దించడంతోపాటు కనీసం రాయడం, చదవడం, డిజిటల్ అక్షరాస్యత, లెక్కలు చేయడం, బ్యాంకు ఖాతాల నిర్వహణ తదితర వాటిపై బోధన చేయనున్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మొదట కాసిపేట మండలంలో..

జిల్లాలో మొదట కాసిపేట మండలంలో ఈ కార్యక్రమం అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ ప్రత్యేక చొరవతో ఇక్కడ ప్రారంభించిన వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యులను చేసేలా లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇందుకోసం ప్రతీ గ్రామంలో ఒక్కో వలంటీర్‌ను నియమించి బోధన చేయనున్నారు. 15ఏళ్ల పైబడిన వారందరినీ గుర్తించి ఈ మేరకు కార్యక్రమం అమలుకు సన్నద్ధమయ్యారు. అంగన్‌వాడీలు, ఐకేపీ, స్థానిక యువత, స్వచ్ఛంద సంస్థలు, దాతల సాయంతో వంద శాతం అక్షరాస్యత సాధనకు పథకం రూపొందించారు. దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ సహకారంతో ఆ మండలంలో అందరికీ చదువు నేర్పడంతోపాటు ఆసక్తి ఉన్న వారికి కుట్లు, అల్లికలు, బ్యూటీషియన్, ఇతరత్రా వృత్తివిద్య నేర్పి ఉపాధి మార్గాలు అందించేలా ప్రోత్సహించనున్నారు. ఒకసారి నేర్చుకున్న వారు మరికొందరికీ నేర్పేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కొక్కరు కనీసం 30మంది చొప్పున బోధించగలిగితే అలా పెద్ద మొత్తంలో నిరాక్షరాస్యులను అక్షర పథం వైపు నడిపించవచ్చనే ఆశయంతో ప్రణాళిక వేస్తున్నారు. పత్తి తీయడం, వ్యవసాయ పనులు పూర్తయితే వయోజనులంతా ఎక్కువగా సమయం గడిపే అవకాశం ఉండడంతో ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. దీనిపై ఇప్పటికే జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, వలంటీర్లు, స్థానికులతో అమలు చేసే ప్రణాళికలపై అంతా సిద్ధం చేశారు.

ఓసీసీ రూ.13.83లక్షలు అందజేత

కాసిపేట: వంద శాతం అక్షరాస్యతలో భాగంగా మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ(ఓసీసీ) సీఎస్ఆర్ నిధులు రూ.13,83,480 విలువైన చెక్కును ఓరియంట్ యూనిట్ హెడ్ బాలగిరిధర్ మంగళవారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు అందజేశారు. న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 22గ్రామ పంచాయతీల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. వందశాతం అక్షరాస్యతకు మండలం ఎంపిక కావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జీఎం ఆనందకులకర్ణి, ఏపీపీ మైన్స్ సహారే తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ పైపైకి..!

- అసైన్డ్ భూముల్లో రియల్ దందా
- ఆకేనపల్లి గ్రామంలో విక్రయాలు
- ఇళ్లు నిర్మిస్తున్నా చర్యలు శూన్యం
- 'బోర్డు'తో సరిపెట్టిన అధికారులు



సోమగూడెం సమీపంలో 3పైకి సర్వేనంబర్‌లో ఏర్పాటు చేసిన బోర్డు.. ఆ వెనుకే నిర్మాణాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి శివారు సోమగూడెం వద్ద జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 3పైకి సర్వే నంబర్ భూముల్లో ఇప్పటికే అనేక క్రయవిక్రయాలు జరిగాయి. వీటిలో ఇళ్ల నిర్మాణాలూ చేపట్టారు. దీనిపై పలుసార్లు ఫిర్యాదులు వెళ్లగా రెవెన్యూ అధికారులు విచారణ చేసి కబ్జా చేయకుండా బోర్డు ఏర్పాటు చేశారు. మరోవైపు సోమగూడెం మాజీ సర్పంచ్ ప్రమీలగౌడ్ లోకాయుక్తలోనూ ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేసిన అధికారులు అసైన్డ్ భూముల్లో విక్రయాలు జరిగినట్లు ఆర్నెళ్ల క్రితమే కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. అయితే ఇప్పటికీ లోలోపల ఆ భూములను విక్రయించేందుకు ఒప్పందాలు జరుగుతున్నాయి. ఎక్కడా బయటకు పొక్కకుండా ప్రభుత్వ అసైన్డ్ భూములను ప్లాట్లు చేస్తూ కొందరు అమ్మేందుకు సిద్ధంగా ఉన్నారు. నోటరీలు, బాండ్ పేపర్లపై రాసుకుంటూ విక్రయిస్తున్నారు. రోడ్డు పక్కనే ఉండటంతో కొందరు కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఇళ్లు కట్టుకున్నా ఏం కాదంటూ అధికార పార్టీ నుంచి కొందరు అండగా నిలవడంతో దందా గుట్టుగా సాగుతోంది.

96ఎకరాల్లో మిగిలిందెంత?

3పైకి సర్వే నంబర్‌లో మొత్తం 96.20 ఎకరాల సర్కారు పరంపోగు భూమి ఉంది. ఇందులో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం మొదట 36ఎకరాలను ఐదుగురు రైతులకు అసైన్డ్ చేసింది. తర్వాత 22మందికి 60ఎకరాలు అసైన్డ్ చేయగా చాలా మంది రైతులు సాగు చేయలేదు. దీంతో ఏళ్ల తరబడి భూములు పడావుగా ఉన్నాయి. వాస్తవానికి అసైన్డ్ భూములను సకాలంలో సాగు చేయకపోతే వీటిని స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. అయితే రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో చాలాచోట్ల ఇవి కబ్జాకు గురయ్యాయి. దీంతో అసైన్డ్ దారులకు సంబంధంలేని వ్యక్తులు ఈ భూముల్లోకి చొరబడ్డారు. పదేళ్లుగా పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగాయి. రెండేళ్లుగా ఇక్కడి నుంచి ఫిర్యాదుల అధికం కావడంతో స్థానిక రెవెన్యూ అధికారులు ఆ భూముల్లో ఓ బోర్డు ఏర్పాటు చేశారు. అప్పటికే ఇళ్ల నిర్మాణాలు జరిగిపోయాయి. ప్రస్తుతం మిగిలిన భూమిని ప్రజాపయోగం కోసం వినియోగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రియల్టర్ల కన్ను

జాతీయ రహదారి, అటు రైల్వే ట్రాక్ సమీపంలోని ఈ భూములను రియల్ వెంచర్లుగా మార్చేందుకు కొందరు తెరవెనుక మంత్రాంగం నడుస్తోంది. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. ఇదే తీరుగా ఇళ్లు కట్టుకుంటే ఎవరూ ఏం చేయరని ప్రచారం చేస్తూ సర్కారు భూమిని అమ్మి సొమ్ము చేసుకునే పనిలో ఉన్నారు. లావుణి పట్టా భూములను తక్కువ ధరకు కొని, అమ్ముకునేందుకు కొందరు రియల్టర్లు రంగంలోకి దిగారు. వాస్తవానికి అసైన్డ్ భూములు అమ్మడం, కొనడం నిషేధం. 1977 చట్టం ప్రకారం అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయొచ్చు. అయితే అంతకుముందు అసైన్డ్ చేసిన వాటికి మాత్రమే మినహాయింపు ఉంటుంది. ఈ చట్టాన్ని తుంగలో తొక్కి అధికార పార్టీ నాయకుడొకరు ముందుండి ఈ భూములను అమ్ముతున్నాడనే ఆరోపణలున్నాయి. దీనిని ప్రజావసరాల కోసం కేటాయించాలంటూ వినతులు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై బెల్లంపల్లి తహసీల్దార్ జ్యోత్స్నను వివరణ కోరగా.. 3పైకి సర్వే నంబర్‌లో విచారణ జరిపి, కబ్జాలకు గురికాకుండా బోర్డు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'రామకృష్ణాపూర్ రూపురేఖలు మారుస్తా'



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణ రూపురేఖలు మారుస్తానని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు గుర్తించి క్యాతనపల్లికి ఎక్కువ నిధులు వెచ్చించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. అమృత్ స్కీం ద్వారా రూ.40 కోట్లు మంజూరయ్యాయని, ప్రతీ ఇంటికి నల్లా నీళ్లు వస్తాయని తెలిపారు. రూ.3లక్షలతో రాజీవ్‌చౌక్‌లో బస్‌షెల్టర్, 16వ వార్డులో రూ.5.40లక్షలతో డ్రైనేజీ, 22వ వార్డులో రూ.5లక్షలతో వాకింగ్ ట్రాక్, రూ.5 లక్షలతో డ్రైనేజీ, 10వ వార్డులో రూ.12 లక్షలతో డ్రైనేజీ, మూడో వార్డులో రూ.5లక్షలతో నిర్మించనున్న చిల్డ్రన్స్ పార్కుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ గద్దె రాజు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు పల్లె రాజు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుంభమేళాలో నిర్మల్ వాసి మృతి


ఫణీందర్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన ఒకరు కుంభమేళాలో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బుధవార్‌పేట్‌కు చెందిన ఫణీందర్ (50) జిల్లా ఆస్పత్రిలోని ఆయుష్ విభాగంలో పనిచేస్తున్నాడు. తన స్నేహితులతో కలిసి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్లాడు. మంగళవారం కాశీలో దైవదర్శనానికి వెళ్లే క్రమంలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

కడెం: ఈ నెల 19న రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాండ్వపూర్ గ్రామానికి చెందిన మల్లేపల్లి భూమన్న (35) ఈనెల 19న ద్విచక్ర వాహనంపై ఉట్నూర్‌లోని సాలేవాడకు వెళ్తుండగా మార్గమధ్యలో మండలంలోని ఉడుంపూర్ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు నిర్మల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. మృతుని తల్లి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సరస్వతి కాలువలో పడి ఒకరు..

సోన్: ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ సరస్వతి కాలువలోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని న్యూవెల్మల్‌లో చోటు చేసుకుంది. ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కుమ్మరి పోతుగంటి చిన్నగంగారాం అలియాస్ నాని (52) సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై తోట నుంచి ఇంటికి వస్తుండగా అడవి పంది అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి సరస్వతి కాలువలోపడి మృతి చెందాడు. మృతుని భార్య అమృత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో స్వాతంత్య్ర సమరయోధుడు..


శ్రీనివాసరావు(ఫైల్)

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, విశ్రాంత ఉపాధ్యాయు డు దండనాయకుల శ్రీనివాసరావు (97) మంగళవారం అనారో గ్యంతో జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో తుది శ్వాస విడిచారు. నెలరోజుల క్రితం అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందా రు. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు కూడా అందుకున్నారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ప్రముఖ టీవీ, సినీ దర్శక నిర్మాత నాగబాల సురేశ్ కుమార్ ఆయన కుమారుడే.

క్షతగాత్రులకు పరామర్శ

ఆదిలాబాద్‌రూరల్: జంగుబాయి దర్శనానికి వెళ్తుండగా నార్నూర్ ఘాట్ వద్ద ఐచర్ వ్యాన్ బోల్తా పడిన ఘటనలో గాయపడిన క్షతగాత్రులను మంగళవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి పరామర్శించారు. రిమ్స్ వైద్యులతో మాట్లాడి వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు.

పరీక్ష సమయం..
ప్రణాళికతో విజయం

- విద్యార్థుల సన్నద్ధతపై అధ్యాపకులు, ఉపాధ్యాయుల దృష్టి
- మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ


మామడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్టడీ అవర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

లక్ష్మణచాంద: పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. ఇంటర్ విద్యార్థులకు మార్చి 5 నుంచి, పదో తరగతి విద్యార్థులకు మార్చి 21 నుంచి పరీక్షలు నిర్వహించేందుకు ఆయా బోర్డులు ఇప్పటికే తేదీలను ప్రకటించాయి. పరీక్షలు సమీపిస్తుండడంతో అధ్యాపకులు, ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

వీటికి దూరంగా ఉండాలి

- విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీసే చరవాణి, మొబైల్ గేములు, టీవీలకు దూరంగా ఉండాలి.
- ప్రతీ నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
- ప్రణాళిక ప్రకారం ఏ రోజు చదివే అంశాలను ఆ రోజే చదవాలి. వాయిదాలు వేయవద్దు.
- పరీక్షలు పూర్తయ్యే వరకు విందులు, వినోదాలకు దూరంగా ఉండాలి.
- విద్యార్థులు గ్రూపులుగా చేరి వివిద సబ్జెక్టులకు సంబంధించిన అంశాలపై చర్చించాలి.

90 రోజుల ప్రణాళికతో....

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 90 రోజుల ప్రణాళికతో అధ్యాపకులు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. డిసెంబర్ వరకు సిలబస్ పూర్తి చేశారు. అప్పటి నుండి నిత్యం ప్రతీ సబ్జెక్టు అధ్యాపకుడు ప్రతీరోజు ఉదయం 9 గంటల నుండి 9:45 వరకు, సాయంత్రం 3:10 నుండి 4:30 వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. వీక్లీ పరీక్షలు, యూనిట్ టెస్టులు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో విద్యా బోధన చేస్తున్నారు. ఒకవైపు రివిజన్ తరగతులు నిర్వహిస్తూనే మరో వైపు ఫిబ్రవరి 20న జరిగే ప్రీఫైనల్‌తో పాటు వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నారు.

ప్రత్యేక తరగతులు...

ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే సిలబస్ పూర్తి చేశారు. పాఠశాలల పనివేళల్లో రివిజన్ చేస్తూనే ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4:15 గంటల నుంచి 5:15 గంటల వరకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. వార్షిక పరీక్షల్లో 10 జీపీఏ సాధించేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి మొదటి వారంలో ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, అధ్యాపకులు పలు సూచనలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	విద్యార్థులు	ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	ఫస్టియర్ విద్యార్థులు	సెకండియర్ విద్యార్థులు
మంచిర్యాల	167	5,851	10	2,012	1,920
నిర్మల్	164	9,127	13	2,505	2,206
ఆదిలాబాద్	107	10,064	13	3,367	3,193
కుమురంభీం	172	6,421	11	2149	2519

పాటించాల్సిన సూచనలు

- పరీక్షలంటే భయం వీడి సమయం వృథా చేయకుండా ముందస్తుగా రూపొందించుకున్న ప్రణాళిక ప్రకారం చదవాలి.
- సిలబస్ పూర్తి అయ్యిందని ఇంటివద్దే ఉండవద్దు. రివిజన్ క్లాసులు వినడంతో పాటు అక్కడ నిర్వహించే స్టడీ అవర్స్ సమయాల్లో తమకు వచ్చిన సందేహాలు నివృత్తి చేసుకోవాలి.
- ప్రశాంత వాతావరణంలో చదవాలి. మధ్య మధ్యలో కొంత విశ్రాంతి తీసుకోవాలి.
- గత ప్రశ్న పత్రాలు, మోడల్ పేపర్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఇచ్చిన ముఖ్యమైన ప్రశ్నలను చదవడం వల్ల వార్షిక పరీక్షలలో వచ్చే ప్రశ్నలపై అవగాహన వస్తుంది.
- పిల్లలు చదువుతున్నారో లేదో తల్లిదండ్రులు నిత్యం తప్పకుండా గమనించాలి.
- గణితశాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయ శాస్త్రం, జీవశాస్త్రం, వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం వంటి సబ్జెక్టుల్లో ముఖ్యమైన సూత్రాలు, సిద్ధాంతాలను ఎక్కువ సార్లు ప్రాక్టీస్ చేయాలి.
- ప్రయోగాలు, పటాలు, ఉదాహరణలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
- చదివిన ప్రతీ అంశాన్ని మళ్లీ పునఃశ్చరణ చేయాలి.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



ఇంటర్ విద్యార్థులు వార్షిక పరీక్షల కోసం ప్రణాళికాబద్ధంగా చదవాలి. అధ్యాపకుల సూచనలు, మెళకువలు పాటించాలి. సమయం వృథా చేయకుండా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు.

– పురుషోత్తమ్, వృక్షశాస్త్రం అధ్యాపకులు, మామడ

జంక్‌ఫుడ్‌కు దూరం ఉండాలి



వార్షిక పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. మాంసాహారం జోలికి వెళ్లవద్దు. ఆకు కూరలు, కూరగాయలు, పోషక విలువలు, ప్రొటీన్స్, విటమిన్స్, మినరల్స్ ఉన్న ఆహారం మాత్రమే తీసుకోవాలి. నిత్యం యోగా, . ధ్యానం చేయాలి. రోజుకు కనీసం ఆరుగంటలు నిద్రపోవాలి.

– డాక్టర్ రత్నాకర్‌రెడ్డి, ఫిజీషియన్, నిర్మల్

పరీక్ష హాలులో...

- ప్రశ్నపత్రం ఇచ్చిన తర్వాత ప్రశ్నలను పూర్తిగా చదివి అర్థం చేసుకున్న తర్వాతే సమాధానం రాయడం ప్రారంభించాలి.
- సమయానుకూలంగా ప్రాధాన్యత ఉన్న ప్రశ్నలకు ముందుగా సమాధానం రాయాలి. మళ్లీ ఒకసారి చూసి ఎక్కడైనా తప్పులుంటే సరి చేసుకోవాలి.

ఆరోగ్యం–ఆహారం ముఖ్యమే

పరీక్షలకు సన్నద్ధం అయ్యే విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా ముఖ్యమే. కనుక పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని వైద్యులు డాక్టర్ రత్నాకర్‌రెడ్డి సూచిస్తున్నారు.

- ఆకుకూరలు, కాయగూరలతో కూడిన, ప్రొటీన్స్, విటమిన్స్, మినరల్స్ ఉన్న ఆహారం తీసుకోవాలి.
- పరీక్షల సమయంలో రోజుకు కనీసం 6 నుంచి 7 గంటలు నిద్రపోవాలి.
- పరీక్షలు పూర్తయ్యే వరకు మాంసాహారం ముట్టుకోవద్దు. బయటి ఆహారం, కొవ్వు ఎక్కువగా ఉన్న ఆహారం, జంకుఫుడ్స్ జోలికి వెళ్లవద్దు.
- ప్రతీరోజు ఉదయం, సాయంత్రం యోగా, ధ్యానం చేయాలి. ఇలా చేయడం వల్ల ఆక్సిజన్ పూర్తిగా మెదడుకు అంది చురుకుగా పనిచేస్తుంది.

అడవిపంది దాడిలో రైతుకు గాయాలు

కైలాస్‌నగర్: బేల మండలం సదల్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని హస్నాపూర్‌లో పొలం పనులు చేస్తున్న యువరైతు ఆడే కిషన్‌పై అడవిపంది దాడి చేసి గాయపర్చింది. పొలం పనుల్లో నిమగ్నమై ఉండగా వెనుక నుంచి వచ్చి దాడికి పాల్పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి బాధితుడిని పరామర్శించారు.

కోతిని తప్పించబోయి.. చెట్టును ఢీకొట్టిన కారు

- ఐదుగురికి స్వల్పగాయాలు


గాయపడిన వ్యక్తికి చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

ఎస్‌ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్‌ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని మేడారం సమ్మక్క– సారలమ్మ దర్శనానికి వెళ్తున్న క్రమంలో పస్రా–తాడ్వాయి మధ్యలో ఓ కారు రోడ్డుపైకి వచ్చిన కోతిని తప్పించే క్రమంలో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ బంధువులతో కలిసి భద్రాచలానికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. మేడారంలోని వనదేవతల దర్శనం నిమిత్తం వెళ్తుండగా పస్రా–తాడ్వాయి మధ్య జాతీయ రహదారిపైకి వచ్చిన కోతిని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పింది. రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. కారులో ఉన్న ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఏటూరునాగారం నుంచి ములుగు వెళ్తున్న పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ రాంపతి వారిని గమనించి ఆగారు. 108కు సమాచారం అందించి గాయపడిన వారిని తన వాహనంలో పస్రా చెక్‌పోస్టు వరకు తీసుకెళ్లారు. అక్కడికి అంబులెన్స్ రాగా, ములుగు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం రాంపతి మరో వాహనాన్ని పిలిపించి డీఈతోపాటు బంధువులను ఆదిలాబాద్‌కు తరలించి మానవత్వం చాటుకున్నారు.

ఎక్సైజ్ అధికారుల స్పెషల్ డ్రైవ్


పట్టుకున్న నాటుసారాతో ఎక్సైజ్ అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎక్సైజ్, ప్రొహిబిషన్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నాటుసారా తయారీ నిర్మూలన లక్ష్యంగా మందమర్రి మండలం పులిమడుగు, కాసిపేట మండలం మామిడి గూడెం గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి 16 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. పులిమడుగుకు చెందిన కుస్రోత్ కిషన్, గుగ్లోత్ రాజు, మామిడిగూడెం గ్రామానికి చెందిన నగావత్ నాగమ్మపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి ఎక్సైజ్ సీఐ జె.ఇంద్రప్రసాద్ తెలిపారు. దాడుల్లో మంచిర్యాల డీటీఎఫ్ సీఐ ఎస్.సమ్మయ్య, ఎక్సైజ్ ఎస్సైలు ఎం.వెంకటేష్, మనీషా రాథోడ్, సిబ్బంది సురేష్, అజయ్, గణేశ్, విజయ, రవీందర్, లక్ష్మణ్, సాగర్, రాజయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు


ఇల్లందు క్లబ్‌లో కొలువుదీరిన బొమ్మలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని బంగ్లా ఏరియాలో గల ఇల్లందు క్లబ్‌లో లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు చూపరులను ఆకట్టుకుంది. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా అధికారుల సతీమణులు బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) డీ సత్యనారాయణరావు సతీమణి హరిణి, డైరెక్టర్(పీపీ) జీ వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి సునీత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తిరుమల వేంకటేశ్వర ఆలయంసెట్టింగ్‌లో శ్రీనివాస కల్యాణాన్ని తలపించే ఆకృతులు, బొమ్మలను సర్వాంగ సుదరంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణ సతీమణి మాలతి, అధికారుల సతీమణులు లక్ష్మీ, స్వరూప, ఉమా, సుధా, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ సంఘం తరపున పోటీ చేస్తున్న వంగ మహేందర్‌రెడ్డిని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ కోసం కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నూతన హెల్త్‌స్కీమ్, పెండింగ్‌లో ఉన్న డీఏతో పాటు 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింప చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఉపాధ్యాయుల సమ్మేళనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఏనుగు అశోక్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి రమణారావు, భూమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దారి సమస్య తీర్చాలని వినతి


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ 26వ వార్డు అశోక్ నగర్ బస్తీ వాసుల దారి సమస్య తీర్చాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ మంగళవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అజయ్‌కుమార్ జైన్‌ను కోరారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఆయనను కలిసి రైల్వేలైన్ నుండి అశోక్ నగర్ బస్తీకి రహదారి సమస్య ఉందని వివరించారు. ఆ సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, నాయకులు ఖాజా, చోటే, పోశం, బస్తీవాసులు సలీం, నసీర్, జాఫర్, బద్రొద్దీన్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 15న జాతీయ సెలవు దినంగా ప్రకటించాలి

మంచిర్యాలఅర్బన్: సూర్‌వీర్ సేవాలాల్ మహరాజ్ జయంతి(ఫిబ్రవరి 15)ని జాతీయ సెలవుదినంగా ప్రకటించాలని గిరిజన విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు ఇందల్ రాథోడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ జయంతి దేశవ్యాప్తంగా జరుపుకునేందుకు వెయ్యికోట్ల బడ్జెట్ కేటాయించాలని, జాతీయస్థాయిలో బంజార ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకులు లచ్చన్న, రఘునందన్, శ్రీనివాస్, జీవీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఈశ్వర్, చరణ్‌నాయక్, నరేష్, రవీందర్‌నాయక్, వంశీ పాల్గొన్నారు.

పెంపుడు కుక్క యజమానిపై కేసు

మందమర్రిరూరల్: పెంపుడు కుక్క చేసిన పనికి యజమానిపై కేసు నమోదైంది. సంఘటన మందమర్రి పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణంలోని ఫస్ట్‌జోన్‌కు చెందిన తాటికొండ బెంజిమెన్ పెంపుడు కుక్క మంగళవారం ఇదే జోన్‌కు చెందిన బైరాజు పాపయ్యను కరిచింది. దీంతో ఆయన కాలికి తీవ్ర గాయమైంది. బెంజిమెన్ తన పెంపుడు కుక్కను నిర్లక్ష్యంగా బయటకు వదిలి వేయడంతో దారిన వెళ్తుండగా పాపయ్యను కరిచిందని ఆయన కుమారుడు మధూకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బెంజిమెన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

వేర్వేరుచోట్ల ఇద్దరు అదృశ్యం


బెంబరి బాపు

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన బెంబరి బాపు అదృశ్యమైనట్లు ఎస్సై ఎల్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన బాపు ఈ నెల 20న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో అతని కుమారుడు భూమేష్ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని అంగడిబజార్ ఏరియాకు చెందిన అక్బర్‌పాషా కనిపించడంలేదని అతని భార్య అస్మా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మద్యానికి బానిసై ఈ నెల 19న ఇంటినుంచి వెళ్లి ఇంత వరకు ఇంటికి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నికలు నిర్వహించాలి


వినతిపత్రం ఇస్తున్న రాములు నాయక్

బెల్లంపల్లి: రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించాలని మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ భూక్యా రాములు నాయక్ సోమవారం రాత్రి రాజ్‌భవన్‌లో గవర్నర్ విష్ణుదేవ్ వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. పాల్వంచ, మణుగూరు, కొత్తగూడెం, మందమర్రి మున్సిపాలిటీలు షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉన్నాయని, వాటికి దశాబ్దాలుగా ఎన్నికలు జరగడంలేదన్నారు. ఎన్నికల నిర్వహణకోసం మార్గదర్శకాలు ఉన్నా అమలు కావడం లేదని, తద్వారా ఏజెన్సీ ప్రాంతాల ఎస్టీలు ప్రజాస్వామిక ఎన్నికల్లో పాల్గొనలేక, రాజకీయంగా ఎదగలేకపోతున్నారని వివరించారు.

సీఎండీ దృష్టికి ఎస్టీపీపీ కార్మికుల సమస్యలు


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్ల దృష్టికి తీసుకెళ్తానని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికులకు ఇతర అలవెన్సులను కలిపి వేతనంతో రూ.5వేలు అదనంగా చెల్లించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న ఒక్కరోజు టోకెన్ చేపట్టిన సమ్మెలో ఎస్టీపీపీలో గల 13 డిపార్టుమెంట్ల నుంచి 1040 మంది కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొన్నారన్నారు. సమావేశంలో హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సారయ్య, ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్, ఉపాధ్యక్షులు చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణారెడ్డి, సత్యనారాయణచారి, నవీన్, శ్రీధర్, అక్బర్, ధీరజ్, తదితరులు పాల్గొన్నారు.

కోళ్లు చనిపోతున్నాయ్...!

- ఆర్‌డీ వైరస్ బారిన పడుతున్న వైనం
- పశువైద్యశాలల్లో అందుబాటులో లేని వ్యాక్సిన్


శాస్త్రినగర్‌లో మృతి చెందిన కోళ్లు

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పెంపుడు కోళ్లు అకస్మాత్తుగా చనిపోతున్నాయి. అప్పటి వరకు బాగానే ఉన్నా ఒక్కసారిగా మృత్యువాత పడుతున్నాయి. దీంతో కారణం తెలియక పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక శాస్త్రినగర్‌లో వారంరోజుల్లో 20కి పైగా కోళ్లు చనిపోయాయి. ఈ విషయమై 'సాక్షి' స్థానిక పశువైద్యుడు విఠల్‌ను ఫోన్‌లో సంప్రదించగా కోళ్లకు ఈ సీజన్‌లో ఆర్‌డీ (రానికేట్ డిసీజ్) వైరస్ సోకుతుందని, ఈ కారణంగానే మృత్యువాత పడుతున్నాయన్నారు. ఏటా వర్షాకాలం–చలికాలం, చలికాలం–వేసవికి మధ్య రెండుసార్లు కోళ్లు ఈ వైరస్ బారిన పడుతాయన్నారు. వ్యాధి నియంత్రణ కోసం పెంపకందారులు ముందస్తుగా వ్యాక్సిన్ వేయించాల్సి ఉంటుందన్నారు. కానీ కొంతకాలంగా పశు వైద్యశాలలకు ఆర్‌డీ వ్యాక్సిన్ సరఫరా నిలిచిపోయిందన్నారు. ప్రైవేటులోనూ అందుబాటులో లేదన్నారు. ప్రభుత్వం పశువైద్యశాలలకు ఆర్‌డీ వ్యాక్సిన్ సరఫరా చేయాలని కోళ్ల పెంపకందారులు కోరుతున్నారు.

పాపహరేశ్వరాలయానికి రూ.3,68,500 ఆదాయం


వేలం నిర్వహిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

దిలావర్‌పూర్: మండలంలో అత్యంత ప్రాచీన ప్రాశస్త్యం గల శ్రీమాతాన్నపూర్ణ కదిలి పాపహరేశ్వరాలయానికి ఆలయ ప్రాంగణంలోని దుకాణాల ద్వారా రూ.3,68,500 ఆదాయం సమకూరింది. ఆలయ ప్రాంగణంలో ఏడాది పాటుగా కొబ్బరికాయలు, పూజా సామగ్రిని విక్రయించేందుకు మంగళవారం దేవాదాయ శాఖ అధికారులు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయలు విక్రయించేందుకు రూ.2,04,000, కిరాణ, పూజా సామగ్రి దుకాణానికి రూ.1,64,500 సమకూరింది. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్ గౌడ్, ఆలయ ఈవో భూమయ్య, జూనిమర్ అసిస్టెంట్ జాదవ్ మాధవరావు పాటిల్, ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్రావు పాటిల్, నాయకులు సింధే దత్తురాం, జాదవ్ మారుతీరావు, మల్లాజీ, సాయినాథ్, ఆలయ అర్చకులు పంచాక్షరి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలి


మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు వరుసగా అవార్డులు సాధించడంలో అధికారుల పాత్ర కీలకమని, ఇందుకు కృషి చేసిన అధికారులు, ఉద్యోగులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం ఎస్టీపీపీని సందర్శించి అడ్మిన్ భవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీపీపీ నీటి వినియోగంతో పాటు రక్షణలో వరుసగా నాలుగు అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలన్నారు. సమావేశంలో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు, వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్, జీఎంలు శ్రీనివాసులు, ఎస్‌ఎస్.ప్రసాద్, ఏజీఎం మదన్ మోహన్, అధికారులు సముద్రాల శ్రీనివాస్, అజ్మీర తుకారాం, తదితరులు పాల్గొన్నారు.